లక్నోపై బెంగళూరు ఘన విజయం




మానేరు **జనత**®

తెలుగు దినపత్రిక · ఇది జనం గొంతుక

16.4.2026 గురువారం Thursday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 356 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ప్రోత్సాహకులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్


# పార్లమెంట్‌లో డీలిమిటేషన్

## నేటి నుంచి ప్రత్యేక సమావేశాలు

## మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ

## ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం

## వాడీవేడీగా సాగనున్న సమావేశాలు



పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదించారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది.

## మహిళా బిల్లుకు ఓకే డీలిమిటేషన్ బిల్లుకు నో

### వ్యతిరేకంగా ఓటేస్తామన్న ఖర్గే



### మహిళా రిజర్వేషన్ బిల్లుపై అభ్యంతరం

కులగణన లేకుండా బిల్లు అమలు కుదరదు

బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటాను దొంగిలించడమే

విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు



## కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు

### శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం

### ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు.

04

### రూ. 25 లక్షల కోట్లు నష్ట పరిహారం చెల్లించాలి

రెండోదఫా చర్చల వేళ ఇరాన్ డిమాండ్



## అమెరికా ఆర్థిక వ్యవస్థలో వసలదారుల కీలక భూమిక



04

వారు ఈ దేశ ఉన్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారు

తన అత్తామామలు కూడా ఆకోవలోని వారే

ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కీలక వ్యాఖ్యలు

## మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి ఆగ్రహం

రెండేళ్లలో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయం

లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు

మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష

02





## రాష్ట్రంలో భగ్గుమంటున్న భానుడు

పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

.. వివరాలు 2లో

## మీ సేవ కేంద్రాల్లో అవినీతి

సర్వీస్ కోసం వచ్చే వారి నుంచి వసూళ్లు ఫిర్యాదులు రావడంతో ఏసిబి సోదాలు

.. వివరాలు 2లో

## డీలిమిటేషన్ కేవలం రాజకీయ సవరణగా మిగలొద్దు

### దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే ప్రజా ఉద్యమం తప్పదు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డీలిమిటేషన్ జరిగితే అది కేవలం ఒక రాజకీయ ప్రక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదని అన్నారు. మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు.

03





02

## వారసత్వ కట్టడాలను పరిరక్షించాలి

పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

కుతుబ్‌షాహి టూంబ్స్ తదితర కట్టడాలను పరిశీలించిన జూపల్లి



03

## పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ

ఆందోళనకు దిగిన జాగృతి అధ్యక్షురాలు కవిత

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
గురువారం 16 ఏప్రిల్ 2026


# మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

**యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి ఆగ్రహం**

**రెండేళ్లలో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయం**

**లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు**

**మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష**



**హైదరాబాద్,ఏప్రిల్15 :** తెలంగాణలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి, పారదర్శకతపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మే-రకు మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. అలాంటి వారికి సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పంట ఉత్పత్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు తుమ్మల. గడ్డిఅన్నారం మార్కెట్‌లో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' అమలు చేయాలని, డిజిటలైజేషన్ ద్వారా జీరో బిజినెస్ సమస్యను తగ్గించాలని నిర్ణయించారు. కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఖర్చు తగ్గింపుపైనా మంత్రి దృష్టి సారించారు. మార్కెట్ యార్డుల్లో సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, జులై చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని అన్నారు. వ్యవసాయ కొనుగోళ్ల విషయానికి వస్తే.. ఖరీఫ్ సీజన్‌లో పత్తి కొనుగోళ్లు పూ-ర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లకు మిర్చి అధికంగా వస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టార్పాలిన్లు, తేమ కొలమానాలు, డ్రైయర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ రైతులకు పూర్తి రక్షణ కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తామని స్పష్టం చేశారు. మొత్తం మీద మార్కెట్ యార్డ్‌లను ఆధునీకరించి, రైతులకు అనుకూలంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల వెల్లడించారు.



# వారసత్వ కట్టడాలను పరిరక్షించాలి

**పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి**

**కుతుబ్‌షాహి టూంబ్స్ తదితర కట్టడాలను పరిశీలించిన జూపల్లి**

**హైదరాబాద్,ఏప్రిల్15 :** కుతుబ్ షాహీ టూంబ్స్ లోని ఇంటర్ప్రిటేషన్ సెంటర్ లో జరుగుతున్న పనులను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. సెవెన్ టూంబ్స్ కటోరా హౌస్, కేబీ మ్యూజియంను ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వక్ఫ్ ట్రిబ్యునల్ లో కేసు పెండింగ్ గురించి చర్చించారు. కేసు పూర్వాపరాలను గురించి వివరించారు. ట్రిబ్యునల్ పరిధిలో పెండింగ్ లో ఉన్న పనులను మినహాయించి, మిగిలిన పనులను వారంలోగా ప్రారంభించి, వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుతుబ్ షాహి టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కిలోమీటర్ల రోప్ వే నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఏ స్థాయిలో ఉన్నాయని ఆరా తీశారు. క్లియరెన్స్ స్టేజిలో ఉన్నాయని, ఆయా శాఖల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు. అనంతరం కటోరా హౌస్ ను సందర్శించారు. కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్మెంట్ ఆటోఆరిటీని సమన్వయం చేసుకుని , డీపీఆర్ ను సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కటోరా హౌస్ ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కటోరా హోస్ పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను వెనువెంటనే తొలగించాలని అధికారులు ఆదేశించారు. తర్వాత గోల్కొండ కోట సమీపంలోని బస్ స్టాప్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాన్నారు. ఈ ప్రతిపాదనలను నేషనల్ మోనుమెంట్ మిషన్ అథారిటీకి పంపి అనుమతులు పొందాలని సూచించారు. అక్కడి నుంచి ఖజానా బిల్డింగ్ మ్యూజియంకు చేరుకున్నారు. ఎంతో చారిత్రాత్మక విలువైన కళాఖండాలు ఉన్న ఈ మ్యూజియం ను పర్యాటకంగా అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ప్రదేశంలో చేనేత వస్త్రాల ప్రదర్శన ను ఏర్పాటు చేయాలని పురావస్తు , అధికారులను ఆదేశించారు. కేబీ మ్యూజియం వెనక భాగంలో ఉన్న ఆక్రమణలను పోలీస్ శాఖ సహకారంతో వారం రోజుల్లో తొలగించాలని అన్నారు. ÷లంగాణలో అద్భుతమైన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఉన్నాయని, వాటిని ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా వాటిని అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీటీడీసీ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, ఇతర శాలల అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో భగ్గుమంటున్న భానుడు

**పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**

**హైదరాబాద్,ఏప్రిల్15 :** తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నమైతే చాలు భానుడు భగ్గుమంటున్నాడు. దాంతో వాతావరణ కేంద్రం హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారిచేసింది. ఆరెంజ్ అలర్ట్ జారీచేయబడిన జిల్లాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి ఉన్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇవాళ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది. నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీచేసింది.

# మీ సేవ కేంద్రాల్లో అవినీతి

**సర్వీస్ కోసం వచ్చే వారి నుంచి వసూళ్లు**

**ఫిర్యాదులు రావడంతో ఎసిబి సోదాలు**

**హైదరాబాద్,ఏప్రిల్15 :** తెలంగాణ వ్యాప్తంగా మీసేవ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. ఖైరతాబాద్, అంబర్ పేట్, అల్వాల్‌లో మీసేవ ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. పౌర సేవ పత్రాల జారీలో దళారుల ద్వారా మీసేవ సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో బుధవారం ఏసీబీ రంగంలోకి దిగింది. సోదాల్లో భాగంగా మీసేవ సిబ్బంది ప్రజలను ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మీ సేవల్లో దోపీడి ఎక్కువైపోయిందని ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. చార్జీల పేరుతో మీసేవ సిబ్బంది చేస్తోన్న దోపిడీకి అడ్డుఅదుపు లేకుండా పోయిందని జనం ఆరోపిస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో కుల, ఆదాయ, నివాస, బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం వెళ్తే దోచుకుంటున్నారు. టెక్నాలజీతో పౌర సేవలను మరింత సులభతరం చేస్తున్నామంటూ అన్ని సేవలను మీ సేవ కేంద్రాలకు అప్పగించి అధికారులు మాత్రం చేతులు దులుపుకుంటున్నారు. దీంతో నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబసభ్యుల ధ్రువీకరణ, ఓబీసీ తదితర సర్టిఫికెట్ల కోసం రూ. 45 చెల్లిస్తే చాలు. కానీ, ఈ ఫీజు ఎక్కడా తీసుకోవడం లేదు. దాదాపు రూ.500 నుంచి రూ.1000 వరకు తీసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరు అప్లై చేసేప్పుడు కాకుండా తిరిగి సర్టిఫికెట్లు ప్రింట్ తీసుకునే టైంలో అదనంగా కలెక్ట్ చేస్తున్నారనీ దరఖాస్తుదారులు చెప్తున్నారు. క్యాస్ట్, లోకల్, ఇన్కమ్ సర్టిఫికెట్లు కావాలంటే సెల్ఫ్ డిక్లరేషన్ కోసం అఫిడవిట్ సమర్పించాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే, ఇది హైదరాబాద్ జిల్లా మినహా మిగతా జిల్లాల్లో తప్పనిసరి అనే రూలేవు. హైదరాబాద్ జిల్లాలో కూడా ఇదివరకు క్యాస్ట్ సర్టిఫికెట్ తీసుకొని ఉంటే ఆ సర్టిఫికెట్ ఆధారంగా మళ్లీ అప్లై చేసుకోవచ్చని అధికారులు చెప్తున్నారు. కానీ, మీ సేవలో మాత్రం అదేమీ కుదరదనీ, అఫిడవిట్ కచ్చితంగా కావాల్సిందేనని వందల్లో వసూళ్లు చేస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో తప్పనిసరిగా సర్వీసులకు సంబంధించిన ధరల పట్టిక ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ చాలా చోట్ల స్పష్టమైన సమాచారంతో చార్ట్ ఏర్పాటు చేయడంలేదు. ఒకవేళ చార్ట్ పెట్టినా ఆ ధరలు కనిపించకుండా చిన్న అక్షరాలతో మొక్కుబడిగా ఏర్పాటు చేస్తున్నారు. మీసేవ నిర్వాహకులు అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని మీ సేవకు సంబంధించిన ఉన్నతాధికారులు చెప్తున్నారు. సెంటర్లలో ఖచ్చితంగా సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయాలని, అందులో చెప్పిన ధరలనే తీసుకోవాలంటున్నారు. ఎక్కడైనా ఎక్కువ డబ్బులు తీసుకున్నట్టు దృష్టికి వస్తే డయల్ 1100 లేదా 18004251110 నంబర్కు కాల్ చేసి సమాచారం ఇస్తే యాక్షన్ తీసుకుంటామంటున్నారు అధికారులు.

# రేవంత్ తీరుపై బిజెపి మండిపాటు

**అనుమానాలతో గందరగోళం సృషించవద్దు**

**రేవంత్ ప్రధానికి లేఖ రాయడంపై పార్టీ నేతల విమర్శలు**

**హైదరాబాద్,ఏప్రిల్15 :** మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై సిఎం రేవంత్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రెంటినీ కలపడాన్ని కుట్ర కోణంగా అభిప్రాయపడ్డారు. దీనిపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానికి లేఖ రాశారు. అయితే రేవంత్ అభిప్రాయాలను బిజెపి నేతలు తోసిపుచ్చారు. పార్లమెంట్ అత్యున్నత వేదిక అని, అక్కడే జరగబోతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్‌కు అవగాహన లేదని బండి సంజయ్ కూడా వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాసిన లేఖపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కూడా స్పందించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. భయాన్ని వ్యాప్తి చేయడం ఆపండి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 81ను చదవండి. డీలిమిటేషన్ కేవలం జనాభాపైనే ఆధారపడదు. అవసరమైన ఇతర అంశాలను కూడా డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. సీట్ల పెంపు కోసం ఏ ఫార్ములాను అనుసరించాలనే నిర్ణయాన్ని ఆ కమిషన్‌కే వదిలారు. అయినా ఎలాంటి కారణం లేకుండా మీరు రాజకీయాలు చేస్తున్నారు.. షేమ్ అని రామచందర్‌రావు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దని రేవంత్ అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కోరారు. కీలక నిర్ణయాల్లో రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు, రాజకీయపార్టీల ఏకాభిప్రాయం సాధించాలి. నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు. జాతీయస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ తర్వాతే డీలిమిటేషన్ చేయాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రామచందర్‌రావు స్పందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇలాంటి అనుమానాలతు, వ్యాఖ్యలతో ఉత్తరాది, దక్షిణ్రాది మధ్య విభేదాలు సృష్టించవద్దని కిషన్ రెడ్డి అన్నారు.

# ఎసిబికి చిక్కిన లంచగొండి ఇంజనీర్

**50వేలు లంచం తీసుకుంటండగా పట్టివేత**




**కరీంనగర్,ఏప్రిల్15 :** కరీంనగర్ జిల్లాలో అవినీతి మున్సిపల్ అధికారి ఏసీబీ అధికారులకు చిక్కాడు. హుజూరాబాద్ మున్సిపల్ ఆఫీసులో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్.. ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికాడు. జిల్లాలోని హుజురాబాద్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ నుసం సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. పట్టణంలో నిర్మించిన స్టోమ్ డైనేజీకి సంబంధించిన ఫైనల్ బిల్లు కోసం మెజర్‌మెంట్ బుక్‌లో నమోదు చేయాలని అధికారులను సంప్రదించాడు. అయితే ఏఈ సుధాకర్‌రెడ్డి రూ. 50 వేలు లంచం డిమాండ్ చేయగా బుధవారం హుజూరాబాద్ ఆర్టీసీ డిపో చౌరస్తా వద్ద నగదును తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏఈపై కేసు నమోదు చేసి ,అరెస్టు చేశామని, అనంతరం కరీంనగర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని వెల్లడించారు. వాటర్ డ్రెయిన్ పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కోసం లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హుజూరాబాద్ మున్సిపల్ ఆఫీసులో అసిస్టెంట్ ఇంజనీర్ గా పనిచేస్తున్న సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. హుజూరాబాద్ కు చెందిన సంతోష్ కుమార్ అనే కాంట్రాక్టర్ నుంచి రూ 50వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు సుధాకర్ రెడ్డిని రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు. హుజరాబాద్ స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులకు సంబంధించిన మెజర్‌మెంట్ బుక్ నమోదు, ఫైనల్ బిల్ ప్రాసెస్ కోసం కాంట్రాక్టర్ సంతోష్ కుమార్ ను ఏఈ సుధాకర్ రెడ్డి రూ.50వేల లంచం డిమాండ్ చేశారు. మున్సిపల్ ఆఫీసులో బాధితుడినుంచి లంచం తీసుకుంటుండగా అరెస్ట్ చేశారు. ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరచ నున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

# దేశవ్యాప్తంగా డీలిమిటిటేషన్ సెగలు

**నిప్పతో చెలగాటమాడుతున్న కేంద్రం**

**తమిళనాడు సిఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు**

**నేడు రాష్ట్ర వ్యాప్తంగా నల్లజెండాల ప్రదర్శనకు పిలుపు**



**చెన్నై,ఏప్రిల్15 :** దేశ రాజకీయాల్లో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు హాట్ టాపిక్ అయింది. గురువారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, దక్షిణాది రాష్ట్రాలు మిశ్రమ గళాన్ని వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కేంద్ర తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీలిమిటేషన్ పక్రియను దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న 'చారిత్రక అన్యాయం'గా స్టాలిన్ అభివర్ణించారు. 'కేంద్ర ప్రభుత్వం నిప్పుతో చెలగాటం ఆడుతోంది. జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించి అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రాలకు శిక్ష విధిస్తారా?' అని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు రాజకీయంగా లబ్ది చేకూర్చి, దక్షిణాది ప్రాబల్యాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా నేడు తమిళనాడు వ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన తెలపాలని డీఎంకే పిలుపునిచ్చింది. ఈ మేరకు ఇంటింటిపై నల్లజెండాలు ఎగురవేయాలని రాష్ట్ర ప్రజలను స్టాలిన్ కోరారు. 'తమిళనాడు పోరాడుతుంది.. తమిళనాడు గెలుస్తుంది' అంటూ ఆయన ప్రకటించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల విభజన జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల లోకసభ సీట్లు తగ్గి, ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరుగుతాయన్నది సీఎం స్టాలిన్ అభియోగం. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల గొంతు నొక్కడం సమాఖ్య వ్యవస్థకే ప్రమాదకరమని ఆయన హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే నిధుల పంపిణీలో అన్యాయం జరుగుతోందని, ఇప్పుడు రాజకీయంగా కూడా మొండిచేయి ఎదురవుతుందని ఆయన వాదిస్తున్నారు. దక్షిణాది ఆత్మగౌరవం కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్టాలిన్ స్పష్టం చేశారు. ఒకవేళ కేంద్రం ఈ బిల్లును ఉపసంహరించుకోకపోతే భారీ మూల్యం తప్పదని ఆయన హెచ్చరించారు. మరోవైపు, రేపు పార్లమెంటులో ఈ బిల్లు ప్రవేశపెట్టనున్న తరుణంలో విపక్షాలు ఐక్య పోరాటానికి సిద్ధమవుతున్నాయి.

రాజ్యాంగ విలువలు, సమాఖ్య స్ఫూర్తిని కాపాడాలని కోరుతూ గళం ఎత్తేందుకు సిద్ధమయ్యాయి. ఈ పోరు కేవలం సీట్ల కోసం మాత్రమే కాదు, దక్షిణాది రాష్ట్రాల ఉనికి, గౌరవం కోసమని విపక్ష పార్టీలు చెబుతున్నాయి.

# డీలిమిటేషన్ కేవలం రాజకీయ సవరణగా మిగలొద్దు

## దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే ప్రజా ఉద్యమం తప్పదు

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక



**హైదరాబాద్,ఏప్రిల్ 15 :** నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డీలిమిటేషన్ జరిగితే అది కేవలం ఒక రాజకీయ పక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదని అన్నారు. మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తేల్చి చెప్పారు. మూడేళ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని కేటీఆర్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణతో పాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రతినిధిత్వాన్ని అణచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని అన్నారు. 'ఢిల్లీ పాలకులు మా మాట వినాలని, బుద్ధి ప్రబలాలని ఆశిస్తున్నాం' అంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

# రాహుల్ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారు

## యూపి నుంచి రాజ్యసభ దక్కడం గౌరవమే

## డబ్బుల మూటలతో రేవంత్ రాజకీయం

## మహిళా రిజర్వేషన్లపై విమర్శలు తగవు

## రేవంత్ వ్యాఖ్యలపై బిజెపి ఎంపి లక్ష్మణ్ ఆగ్రహం

**న్యూఢిల్లీ,ఏప్రిల్15 :** తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం తన గొంతు వినిపిస్తున్నానని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏమైనా చేశారా? అని ఆయన ప్రశ్నించారు. తుపాకీ పట్టుకొని ఆయన ఎవరి పక్కన నిలుచున్నారో అందరికీ తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నిలదీశారు. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నిక కావ్వడం తెలుగు వాడిగా తనకు గౌరవంగా ఉందన్నారు. తనపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బుధవారం న్యూఢిల్లీలో ఎంపీ కె. లక్ష్మణ్ స్పందించారు. నీతులు చెబుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. మహిళల అవకాశాలను దెబ్బ తీయడానికి కుట్ర పన్నుతున్నారంటూ విపక్షాలపై ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారా?, ఎస్సీ, ఎస్టీ వాటా అడ్డుకోవడానికి కుట్ర పన్నుతున్నారా? అంటూ విపక్షాలకు ఆయన ప్రశ్నలు సంధించారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యం అంటే డబ్బే అని వ్యంగ్యంగా అన్నారు. ఢిల్లీకి ఆయన డబ్బుల మూటలు మోశారని విమర్శించారు. నగదు కేంద్రంగా రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. డబ్బున్న వాళ్ళకి ఓటు విలువ ఎక్కువ అనేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్య హాస్యాస్పదంగా ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేశారని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ పరిధిలో150 సీట్లను 300 సీట్లు చేశారని పేర్కొన్నారు. ఏ శాస్త్రీయ పద్ధతిలో గ్రేటర్ హైదరాబాద్‌ను విభజించారంటూ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. 543 సీట్లలో మహిళా రిజర్వేషన్లు పెంచమనడం వెనుక ఎస్సీ, ఎస్టీ మహిళలకు నష్టం చేయాలన్న కుట్ర దాగి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నేతలపై ఆయన విరుచుకు పడ్డారు. జీఎస్డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలన్నది కాంగ్రెస్ విధానమా? అనేది స్పష్టం చేయాలని ఆ పార్టీ నేతలను ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ వ్యతిరేక ప్రతిపాదన చేస్తున్నారని వెంటనే దీనిని వెనక్కి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆయన స్పష్టం చేశారు.

# మహిళా రిజర్వేషన్లతో పాటు బిసి బిల్లు పెట్టాలి

## ఇష్టానుసారంగా డీలిమిటేషన్ చేస్తే చూస్తూ ఊరుకోం

## రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి వ్యాఖ్యలు గర్హనీయం

## కాంగ్రెస్ ఎంపి మల్లు రవి మండిపాటు



**న్యూఢిల్లీ,ఏప్రిల్15 :** మహిళా రిజర్వేషన్‌తో పాటు బీసీలకు కూడా రిజర్వేషన్ పెట్టాలని ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా డీలిమిటేషన్ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఎంపీ హెచ్చరించారు. పార్లమెంట్‌లో తమ గళం వినిపిస్తామన్నారు. ఇలానే జరిగితే తెలంగాణ ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఆమోదం పొందాలంటే టూ థర్డ్ మెజారిటీ కావాలని ఎంపీ మల్లు రవి వెల్లడించారు. ఇకపోతే సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎంపీ తీవ్రంగా ఖండించారు. సీఎంను నోరుమూసుకుని కూర్చోమంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అహంకారపూరిత మాటలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యం అంటే కిషన్ రెడ్డికి విలువ లేదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. భారతదేశం ఐక్యంగా ఉండాలని ఇద్దరు కాంగ్రెస్ ప్రధాన మంత్రులు ప్రాణత్యాగం చేశారని ఎంపీ గుర్తుచేశారు. భారతదేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత ఉందని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లు పైన పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి కేంద్రం హడావుడి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన ను రెండింటిని ఒకటిగా చూపించి ప్రతిపక్షాలు సహకరించడం లేదని ప్రచారం చేస్తున్నారు. ఈ రెండు అంశాలు ఒకదానికి ఒకటి సంబంధం లేనివని ఎంపి మల్లు తెలిపారు. రెండింటిని విడదీసి వేరు వేరుగా చర్చించి అమలు పైన విధివిధానాలపైన పార్లమ్టెంట్ నిర్ణయం తీసుకోవాలన్నారు. రాజ్యాంగంలోనే పురుషులతో పాటు మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ.. అన్నారు.రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తీసుకువచ్చారు.. సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చారు.. అప్పుడు రాజ్యసభలో ఆమోదించారు. బీజేపీ సహకరించకపోవడం వల్లనే లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదని, మరి ఇంత కాలం మోడీ ఈ బిల్లును పట్టించుకోలేదన్నారు. 2026 తర్వాత జనాభా లెక్కల తర్వాత గెజిట్ ఆధారంగా మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని చట్టం చేశారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో 543 లోక్ సభ సభ్యుల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తే 181 మహిళలు ఎన్నిక అయ్యేందుకు అవకాశం ఉండేదని అన్నారు. 2026 జనభా లెక్కలు పూర్తి చేసి అమలు చేయకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా చట్టం ముందుకు తెస్తున్నారని అన్నారు. మహిళా రిజర్వేషన్లు, పునర్విభజన ను కలపడంతో రాజకీయ కుట్ర ఉందన్నారు.

# ఎపి ఇంటర్ ఫలితాలు విడుదల

## మొదటి సంవత్సరంలో 77 శాతం

## రెండో సంవత్సరంలో విద్యార్థులు 81 శాతం పాస్

## ఫలితాల్లో అమ్మాయిలదే హవా

**అమరావతి,ఏప్రిల్15 :** ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం ఉదయం మంత్రి నారా లోకేశ్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత నమోదు అయ్యింది. గత 12 ఏళ్లలో అత్యధికంగా మొదటి సంవత్సరం విద్యార్థులు 77 శాతం పాస్ అయ్యారు. రెండో సంవత్సరం విద్యార్థులు 81 శాతం పాస్‌తో రెండో అత్యుత్తమ ఫలితాలను సాధించారు. విద్యార్థులు తమ ఫలితాలనువెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. మెసేజ్‌ను 9552300009 నంబర్‌కు వాట్సాప్‌లో పంపితే కూడా ఫలితాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ, ప్రభుత్వ ఆధీన కళాశాలల్లో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయి. గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం 54 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరం జీజేసీల్లో 68 శాతం పాస్ అయ్యారు. ఇది గత 12 ఏళ్లలో అత్యధిక ఉత్తీర్ణతగా నమోదు అయింది. విద్యార్థులు, ప్రిన్సిపల్స్, లెక్చరర్ల సమిష్ఠి కృషి వల్లే ఈ ఫలితాలు వచ్చాయని అధికారులు తెలిపారు. అకడమిక్ ఎక్సలెన్స్ కోసం అందరూ కలిసి కృషి చేయడం ఫలించిందని ప్రశంసించారు. ఇంటర్ ఫలితాల్లో అబ్బాయిల కంటే అమ్మాయిలు మెరుగైన ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 85శాతంగా నమోదయ్యింది. ప్రథమ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 81శాతంగా నమోదు అయ్యింది. రీకౌంటింగ్ / రీవెరిఫికేషన్ దరఖాస్తులలను ఏప్రిల్ 20 నుంచి 27 వరకు వరకు స్వీకరిస్తారు. స్కాన్ కాపీతో రీవెరిఫికేషన్‌కు అవకాశం ఉంది. సప్లిమెంటరీ పరీక్షలు మే 21 నుంచి జూన్ 4 వరకు థియరీ పరీక్షలు, జూన్ 7 నుంచి 11 వరకు ప్రాక్టికల్స్ రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ ఉంటుంది. మొదటి సంవత్సరం పాస్ అయిన వారికి ఇంప్రూవ్‌మెంట్‌కు ఛాన్స్ ఉంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పూర్తి పరీక్షలు రాయాల్సి ఉ ంటుంది. ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ చెందవద్దని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తిరిగి కృషి చేసి విజయం సాధించాలని వారికి పిలుపు ఇచ్చారు. ఈ సమయంలో తల్లిదండ్రులు విద్యార్థులకు మానసిక బలం ఇవ్వాలని, భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని విజయాలు సాధించాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.



# పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ

## ఆందోళనకు దిగిన జాగృతి అధ్యక్షురాలు కవిత



**వికారాబాద్,ఏప్రిల్15 :** వికారాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్టు చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములను బలవంతంగా సేకరిస్తున్నారని ఆరోపిస్తూ ఉదయం నుంచి కవిత ఆందోళన చేశారు. ఈ క్రమంలోనే రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో రైతుల పొట్ట కొడుతోందని ఆమె ఆరోపించారు. భూసేకరణ ఆపకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామన్నారు. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీలు రైతులకు సంఘీభావం తెలిపాయి.

# జనాభా ప్రకారం ఆలోచిస్తే నష్టమే

## అందుకే రాష్ట్రాల్లో 50 శాతం పెంపు : బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి

**హైదరాబాద్,ఏప్రిల్15 :** జనాభా ప్రకారమైతే దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనే అన్ని రాష్ట్రాల్లో 50 శాతం పెంపు విధానం తెచ్చారని తెలంగాణ భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లపై ఆయన మీడియాతో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వమే చట్టాలు చేసిందన్నారు. 1972 లో కాంగ్రెస్ చేసిన డీలిమిటేషన్ వల్ల ఏపీకి ఒక లోక్‌సభ సీటు తగ్గింది. ప్రస్తుత సీట్ల ప్రకారమైతే మహిళలకు 170 సీట్లు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. సీట్లు పెంచి మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే 270కిపైగా సీట్లు వస్తాయి. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా హైబ్రిడ్ పాలసీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారని విమర్శించారు.

డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని తెలిపారు. ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ విమర్శలు చేస్తున్నారని అన్నారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నేతలపై ఆయన విరుచుకు పడ్డారు. జీఎస్డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలన్నది ఎక్కడ ఉందో చెప్పాలని అన్నారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని తెలియదా అని అన్నారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని గుర్తు చేశారు. మహిళల అవకాశాలను దెబ్బ తీయడానికి కుట్ర పన్నుతున్నారంటూ విపక్షాల తీరుపై మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారని ఇది సరికాదని అన్నారు.

# పునర్విభజన జనాభా ప్రకారమే

## రాజ్యాంగం నిర్దేశించింది కూడా ఇదే

## సిఎం రేవంత్ గందరగోళ వ్యాఖ్యలు తగవు

## బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు




**వరంగల్,ఏప్రిల్15 :** నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే అసత్య ప్రచారానికి తెరలేపారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. బుధవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన పక్రియ అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. సీట్ల పెంపు అనేది 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుంది. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల్లో గందరగోళం సృష్టించేలా మాట్లాడుతూ రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ సిస్టమ్' అనే విధానం ప్రపంచంలోనే ఎక్కడా లేదని రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి చెబుతున్న ప్రతిపాదనలు అసంబద్ధంగా ఉన్నాయని, అవేవీ చట్టబద్ధమైనవి కావని ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇండియా కూటమి, కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని ధ్వజమెత్తారు. నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదు. సీఎం రేవంత్ రెడ్డి తన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని రాంచందర్‌రావు అన్నారు. దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ పక్రియపై చర్చ జరుగుతున్న వేళ, రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు కేవలం కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లడానికేనని రాంచందర్‌రావు విమర్శించారు. పునర్విభజన పక్రియ చట్టప్రకారం పారదర్శకంగా జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# కాల్పుల విరమణ గడువు పొడిగించే ఛాన్స్ లేదు

## శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం

## ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు



**వాషింగ్టన్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

# రూ. 25 లక్షల కోట్లు నష్ట పరిహారం చెల్లించాలి

## రెండోదఫా చర్చల వేళ ఇరాన్ డిమాండ్

**టెహ్రాన్ :** అమెరికాతో రెండో సారి శాంతి చర్చలు ప్రారంభం కానున్న వేళ ఇరాన్ కీలక డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. ఇటీవల జరిగిన యుద్ధంలో తమ దేశానికి భారీ నష్టం వాటిల్లిందని పేర్కొంటూ, దాదాపు 270 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 25 లక్షల కోట్లు పరిహారం చెల్లించాలని ఇరాన్ డిమాండ్ చేసింది. తమకు జరిగిన నష్టాలను భర్తీ చేసేందుకు ఇతర దేశాలు సహాయపడాలని ఇరాన్ కోరుకుంటోంది. యుద్ధం కారణంగా దేశంలోని మౌలిక సదుపాయాలు, గృహాలు, రవాణా వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ నష్టాన్ని దేశం ఒంటరిగా భరించడం సాధ్యం కాదని, అంతర్జాతీయ స్థాయిలో పరిహారం అవసరమని ఇరాన్ పేర్కొంది. గృహ నిర్మాణాలు, మౌలిక వసతులు ధ్వంసం అవడమే కాకుండా, చమురు, వాణిజ్య రంగాల్లో మూసివేత వల్ల నష్టాలు భారీగా ఉన్నాయని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నష్టాల అంచనా ఇంకా పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. తమ నష్టాలను భర్తీ చేసుకునేందుకు హోర్ముజ్ జలసంధి ద్వారా వెళ్లే నౌకలపై పన్ను విధించడం వంటి చర్యలను కూడా ఇరాన్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. కాగా, యుద్ధ సమయంలో ఐదు అరబ్ దేశాలు తమ భూ భాగాన్ని ఉపయోగించేందుకు అమెరికా-ఇజ్రాయెల్ దళాలకు అనుమతి ఇచ్చాయని, ఆ దేశాలు కూడా తమకు పరిహారం చెల్లించాలని ఇరాన్ ఇప్పటికే కోరింది.

# అమెరికా ఆర్థిక వ్యవస్థలో వసలదారుల కీలక భూమిక

## వారు ఈదేశ ఉన్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారు

## తన అత్తామామలు కూడా ఆకోవలోని వారే

## ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కీలక వ్యాఖ్యలు



**న్యూయార్క్:** అమెరికా ఆర్థికవ్యవస్థలో వలసదారులు కీలక పాత్ర పోషిస్తున్నారని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ అన్నారు. అదే సమయంలో ఇమిగ్రేషన్ ప్రోగ్రామ్స్‌పై కఠిన నియంత్రణ నూ సమర్థించారు. అమెరికా పౌరసత్వం పొందడం అంటే ఈ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడమేనని వాన్స్ స్పష్టంచేశారు. హెచ్-1బీ వ్యవస్థలో మోసాలు జరుగుతున్నాయని భావిస్తున్నట్లు చెప్పారు. నేను భారత్ నుంచి వలస వచ్చిన కుటుంబానికి చెందిన అమ్మాయిని వివాహం చేసుకున్నాను. నాకు నా అత్తమామలంటే చాలా ఇష్టం. వారు గొప్ప వ్యక్తులు. యూఎస్‌కు వారు ఎంతో సేవ చేశారు. భారత్ నుంచి వచ్చి ఇక్కడ చదువుకొని, ఈ దేశ పౌరుడిగా మారిన మా మామగారు.. అమెరికా ప్రయోజనాల కోసమే పాటుపడ్డారని వ్యాఖ్యానించారు. భారత మూలాలున్న తన అత్తింటి కుటుంబంపై జేడీవాన్స్ ప్రశంసలు కురిపించారు. అమెరికాను సుసంపన్నం చేయడంలో, ఈ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడంలో వారు ఒక నిదర్శనంగా నిలిచారన్నారు. జార్జియా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. హెచ్-1బీ వీసాలపై అమెరికాలో నివసిస్తున్నవారు గ్రీన్‌కార్డ్ కోసం సుదీర్ఘకాలం వేచి చూడాల్సి వస్తోందంటూ భారత సంతతి వ్యక్తి ఒకరు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా బదులిచ్చారు. ఉషా చిలుకూరి అమెరికాలో కాలిఫోర్నియాలోని శాండియాగో ప్రాంతంలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఆమె పూర్వీకులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1980ల్లోనే అమెరికా వలస వెళ్లారు. వీళ్ల ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. ఇరాన్‌తో చర్చల అంశంపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాల మధ్య ఉన్న అపనమ్మకం రాత్రికి రాత్రి పోయేది కాదని అన్నారు. ఇరాన్ ప్రతినిధులు ఒప్పందం కుదరాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లోనే ఈ

సంప్రదింపులు జరగొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఆలోపే చర్చల ద్వారా శాశ్వత శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరుపక్షాలు కోరుకుంటున్నట్లు తెలుస్తోంది.

# పార్లమెంట్‌లో డీలిమిటేషన్

## నేటినుంచి ప్రత్యేక సమావేశాలు

## మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ

## ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం

## వాడీవేడీగా సాగనున్న సమావేశాలు



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోడీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ నాలుగు డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. ఇప్పటి వరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉన్నాయి. అయితే ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందులో 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332, 334ఏలకు సవరణలు ప్రతిపాదించింది. రాజ్యాంగంలో గరిష్ఠంగా 550 లోక్‌సభ స్థానాలను పేర్కొన్నా ప్రస్తుతం 543 మాత్రమే ఉన్నాయి. అంటే.. గరిష్ఠ సంఖ్యలో 98.72 నియోజకవర్గాలే ఉన్నట్లు లెక్క. ఆ నిష్పత్తి ప్రకారం చూస్తే కేంద్ర ప్రభుత్వం కొత్త స్థానాల సంఖ్యను 840దాకా ఖరారుచేసే సూచనలున్నాయి. అయితే ఇదివరకు వివిధ పార్టీల నాయకులతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చర్చలు జరిపినప్పుడు.. మొత్తం స్థానాలను గంపగుత్తగా 50శాతం పెంచుతామని చెప్పారు. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడున్న 543 స్థానాలు 816కి చేరే అవకాశం ఉంటుంది. ఆర్టికల్ 81(3)లో 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని ఉంది. ఇప్పుడు దాన్ని సవరించి.. గతంలోని జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడానికి తాజా బిల్లును కేంద్రం ప్రతిపాదించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 అసెంబ్లీ స్థానాల పునర్విభజన, ఆర్టికల్ 170 అసెంబ్లీ స్థానాల గరిష్ఠ సంఖ్య గురించి చెబుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల ప్రకారం ఆర్టికల్ 82 కింద అసెంబ్లీ స్థానాలను పునర్విభజించాలంటే 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఆ నిబంధనను సవరించి ప్రతి జనాభా లెక్కల తర్వాత అసెంబ్లీ స్థానాలను పునర్విభజించడానికి అవకాశం కల్పించారు. ఆర్టికల్ 334ఏలో ఇదివరకు 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 (మహిళా రిజర్వేషన్ల చట్టం) ఆమోదం పొందిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ప్రాతిపదికన నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పుడు దాన్ని సవరించి డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఇవి అమల్లోకి వస్తాయని స్పష్టత ఇచ్చారు. 84వ రాజ్యాంగ సవరణ చట్టం-2001లో ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332లను సవరించి 1971 జనాభా లెక్కల ప్రకారమే పార్లమెంటు, అసెంబ్లీల సీట్లను కేటాయించాలని పేర్కొన్నారు. 2026 తర్వాత తొలి జనాభా లెక్కలు చేపట్టేంతవరకూ వాటిని పునర్విభజించకూడదని షరతు విధించారు. 2003లో చేసిన 87వ రాజ్యాంగ సవరణ చట్టంలో ఆర్టికల్ 81, 82, 170, 330లను సవరించి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను పెంచకుండా 2001 జనాభా లెక్కల ప్రకారం ఆయా రాష్ట్రాల్లోని స్థానాలను పునర్విభజించు కోవడానికి అవకాశం కల్పించారు. దీని ప్రకారం 2008లో నియోజకవర్గాల పునర్విభజన చేయగా 2009 ఎన్నికల్లో అవి అమల్లోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పునర్విభజన కోసం సుప్రీంకోర్టు ప్రస్తుత/ మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుంది. బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కమిషన్ అమల్లోకి వస్తుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత/మాజీ న్యాయమూర్తిని కేంద్ర ప్రభుత్వం కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గానీ, ఆయన నామినీగానీ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉంటారు. అలాగే రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులవుతారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంటు, అసెంబ్లీలతోపాటు, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల పునర్విభజననూ చేపడుతుంది. తాజా జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఎన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు ఉండాలన్నది ఈ కమిషన్ నిర్ణయిస్తుంది. అలాగే రాష్ట్రాలవారీగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను విభజిస్తుంది.

# మహిళా బిల్లుకు ఓకే.. డీలిమిటేషన్ బిల్లుకు నో

## వ్యతిరేకంగా ఓటేస్తామన్న ఖర్గే



**న్యూఢిల్లీ :** పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్.. డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ రెండు బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అయింది. ఈ క్రమంలో పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారంఢిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో భేటీ అయ్యింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో కూటమి నేతలు వివిధ అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లపై అనాడైనా ఇనాడైనా కాంగ్రెస్‌ది ఒకటే స్టాండ్ అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న ట్రిక్కులకు వ్యతిరేకమని.. మహిళా రిజర్వేషన్లు అంటూ దొంగ దారిలో డీలిమిటేషన్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని కాంగ్రెస్ పార్టీ వైఖరిని తెలియజేశారు. డీలిమిటేషన్‌పై ఇండియా కూటమి పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశ పెడుతోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ లో సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి అనుకూలంగానే ఉందని.. కానీ దానిని తీసుకువచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం లోని అధికారాల న్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్‌లో ఐక్యంగా పోరాడుతామని ఖర్గే పేర్కొన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు.

మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య (550)ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

# మహిళా రిజర్వేషన్ బిల్లుపై అభ్యంతరం

## కులగణన లేకుండా బిల్లు అమలు కుదరదు

## బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటాను దొంగిలించడమే

## విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు

**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్లపై కేంద్రం తీరును రాహుల్ గాంధీ తప్పుబట్టారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న సవరణ కేవలం అధికారం కోసమేనని అన్నారు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతు ఇస్తుందని తేల్చి చెప్పారు. గురువారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. కులగణన లేకుండా మహిళా రిజర్వేషన్ల అమలులో పారదర్శకత ఉండదని అభిప్రాయపడ్డారు. చిన్న రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటమే తమ లక్ష్యమన్నారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో కుట్ర జరుగుతోందన్నారు. కుల గణన డేటాను విస్మరించడం అంటే బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటాను దొంగిలించడమేనని అన్నారు. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లుతో మహిళా రిజర్వేషన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ఏప్రిల్ 16న పార్లమెంటు ముందుకు రానున్న నేపథ్యంలో ప్రజలను ఉద్దేశించి రాహుల్ గాంధీ ఓ వీడియో విడుదల చేశారు. డీలిమిటేషన్‌తో కేంద్ర ప్రభుత్వం గెర్రీమాండరింగ్‌కు పాల్పడే ప్రయత్నం చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నియోజకవర్గాలను తమకు అనుకూలంగా పునర్వ్యవస్థీకరించుకునే కుట్ర చేస్తోందన్నారు. గెర్రీమాండరింగ్‌తో మళ్లీ అధికారం పొందేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు.కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేష్ మాట్లాడుతూ.. 'మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇస్తున్నాం. మహిళా రిజర్వేషన్లను 2023లోనే అమలు చేయమని కోరాం. మా విజ్ఞప్తిని ఏమాత్రం కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఓటమి నిర్ధారణ కావడంతో, అర్ధాంతరంగా ఈ బిల్లును ప్రవేశపెట్టాలని అధికార బీజేపి భావిస్తోంది. డీ లిమిటేషన్ ద్వారా నార్త్, ఈస్ట్, సౌత్, చిన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుంది.

లోక్‌సభ 543 స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు కల్పించాలి. నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తాము' అని అన్నారు. మహిళా రిజర్వేషన్లకు మేము వ్యతిరేకం కాదు. ప్రభుత్వం తెచ్చిన విధానమే తప్పు. రాజకీయ లబ్ది కోసమే మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రం తెరపైకి తెచ్చింది. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. అస్సాం, జమ్మూ కాశ్మీర్‌లో జరిగినట్లే నియోజకవర్గాల విభజనలో అవకతవకలకు కేంద్రం యత్నిస్తోంది. మహిళా రిజర్వేషన్ల అమలులో జాప్యం చేయడానికే కేంద్రం సాకులు వెతుకుతోంది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా విపక్షాలన్నీ ఐక్యంగా పోరాడతాయి' అని అన్నారు.

# లక్నోపై బెంగళూరు ఘన విజయం

## ఆర్‌సీబీ టాప్ షో

## జోష్ హాజిల్‌వుడ్ అదుర్స్

## రాణించిన విరాట్ కోహ్లీ





బెంగళూరు: ఐపీఎల్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) వరుస విజయాలతో దుమ్మురేపుతున్నది. రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో ఓటమి మినహాయిస్తే..ముంబై ఇండియన్స్‌ను వారి సొంతగడ్డపైనే మట్టికరిపించిన ఆర్‌సీబీ..లక్నో సూపర్‌జెయింట్స్(ఎల్‌ఎస్‌జే) భరతం పట్టింది. చిన్నస్వామిలో గత ఓటములకు దీటైన ప్రతీకారం తీర్చుకుంటూ ఆర్‌సీబీ తొలిసారి విజయాన్నందుకుంది. బుధవారం కిక్కిరిసిన ప్రేక్షకుల మధ్య సాగిన పోరులో ఆర్‌సీబీ 5 వికెట్ల తేడాతో లక్నోపై ఘన విజయం సాధించింది. తద్వారా ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలతో 8 పాయింట్లతో ఆర్‌సీబీ అగ్రస్థానంలోకి దూసుకెళ్లగా, లక్నో వరుసగా రెండో ఓటమితో ఏడో స్థానంలో కొనసాగుతున్నది. తొలుత హాజిల్‌వుడ్(4-0-20-1), రసిక్ సలామ్(4/24), భువనేశ్వర్(3/27) ధాటికి లక్నో 20 ఓవర్లలో 146 ఆలౌటైంది. మిచెల్ మార్ష్(40), ముకుల్ చౌదరి(39), ఆయూశ్ బదోని(38) ఒకింత ఆకట్టుకున్నా..మిగతావారు ఘోరంగా విఫలమయ్యారు. పిచ్ పిరిస్థితులను చక్కగా సద్వినియోగం చేసుకుంటూ టాస్ గెలిచిన ఆర్‌సీబీ బౌలింగ్ ఎంచుకున్నది. కెప్టెన్ రిషబ్ పంత్(1), నికోలస్ పూరన్(1), అబ్దుల్ సమద్(0) సింగిల్ డిజిట్ స్కోర్లకు పరిమితమయ్యారు. ఆ తర్వాత 147 పరుగుల లక్ష్యఛేదనకు దిగిన ఆర్‌సీబీ 15.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ(34 బంతుల్లో 49, 6ఫోర్లు, సిక్స్) పరుగు తేడాతో అర్ధసెంచరీ అవకాశాన్ని చేజార్చుకోగా, రజత్ పటిదార్(27), జితేశ్‌శర్మ (23) ఆకట్టుకున్నారు. ప్రిన్స్ యాదవ్ (3/32), అవేశ్‌ఖాన్ (2/23) రాణించారు. పొదుపైన బౌలింగ్‌తో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన హాజిల్‌వుడ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

### లక్నో పడుతూ లేస్తూ..

లక్నో బ్యాటింగ్ తీరు పడుతూ లేస్తూ అన్నట్లు సాగింది. పిచ్ పరిస్థితులను ముందే అంచనా వేసిన ఆర్‌సీబీ..బౌలింగ్ ఎంచుకుని ఆదిలోనే పైచేయి సాధించింది. జాకబ్ డఫీ స్థానంలో జట్టులోకి వచ్చిన స్టార్ పేసర్ హాజిల్‌వుడ్..లక్నో బ్యాటర్లకు కొరకరాని కొయ్యగా మారాడు. వేగానికి స్వింగ్ జోడిస్తూ హాజిల్‌వుడ్ విసిరిన బంతులకు లక్నో బ్యాటర్ల దగ్గర సమాధానం లేకపోయింది. మార్ష్, మార్క్మ్(ర12) కలిసి తొలి వికెట్‌కు 32 పరుగులు జోడించగా, పవర్‌ప్లే పూర్తయ్యే సరికి లక్నో వికెట్ నష్టానికి 35 పరుగులకు పరిమితమైంది. హాజిల్‌వుడ్ బౌలింగ్‌లో వైవిధ్యమైన షాట్‌కు ప్రయత్నించిన కెప్టెన్ పంత్ మోచేతికి బంతి బలంగా తాకింది. నొప్పితో విలవిలలాడిన పంత్ రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. మిడిల్‌లో పూరన్‌ను హాజిల్‌వుడ్ క్లీన్‌బౌల్డ్ చేయగా, బదోని, ముకుల్ సమయోచితంగా ఆడారు. అడపాదడపా బౌండరీలతో కీలక పరుగులు జతచేశారు. వీరిద్దరు ఆడకపోతే లక్నో కనీసం 100 పరుగులకే పరిమితమయ్యేది. పంత్ తిరిగి బ్యాటింగ్‌కు వచ్చినా లాభం లేకపోయింది.

### కోహ్లీ జోరు:

ఐపీఎల్‌లో తొలిసారి ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్‌కు వచ్చిన కోహ్లీ దూకుడు కనబరిచాడు. మోకాలి నొప్పితో ఫీల్డింగ్‌కు దూరంగా ఉన్న కోహ్లీ బ్యాటింగ్‌లో తనదైన ట్రేడ్‌మార్క్ షాట్లతో అలరించాడు. షమీ, ప్రిన్స్ యాదవ్‌ను లక్ష్యంగా చేసుకుంటూ బౌండరీలతో దుమ్మురేపాడు. సాల్ట్(7) త్వరగానే ఔటైనా..పడిక్కల్(10), పటిదార్‌తో కలిసి ఇన్నింగ్స్ కొనసాగించాడు. మంచి బంతులను గౌరవిస్తూనే చెత్త బంతులను బౌండరీకి సాగనంపాడు. అవేశ్ బౌలింగ్‌లో ఔటైనా ఆఖర్లో జితేశ్, డేవిడ్, షెఫర్డ్ బ్యాటింగ్‌తో ఆర్‌సీబీ అలవోక విజయాన్ని ఖాతాలో వేసుకుంది.

### సంక్షిప్త స్కోర్లు

లక్నో: 20 ఓవర్లలో 146 ఆలౌట్ (మార్ష్ 40, ముకుల్ 39, రసిక్ 4/24, భువనేశ్వర్ 3/27), బెంగళూరు: 15.1 ఓవర్లలో 149/5(కోహ్లీ 49, పటిదార్ 27, ప్రిన్స్ 3/32, అవేశ్ 2/23)



# రోహిత్ శర్మ హెల్త్ రిపోర్ట్


### తుది నిర్ణయాన్ని రోహిత్ శర్మకే వదిలేసిన మేనేజ్మెంట్!

ఆదివారం (ఏప్రిల్ 13) ఐపీఎల్ లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తుండగా స్టార్ బ్యాట్స్ మెన్ కుడి హ్యామ్‌స్ట్రింగ్ గాయానికి గురై, రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడిన సంగతి తెలిసిందే. తాజాగా రోహిత్ మెడికల్ రిపోర్టులు వెలువడ్డాయి. ఆదివారం రాత్రి నిర్వహించిన ప్రాథమిక స్కాన్ రిపోర్ట్స్‌లో రోహిత్ కండరాలకు ఎలాంటి తీవ్రమైన గాయం లేదా చీలిక ఉన్నట్లు ఆధారాలు లభించలేదు. ఇది ముంబై అభిమానులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. అయితే, ఈ నివేదిక ఇంకా అసంపూర్తిగా ఉందని, కండరాల పట్టివేత (కొత్తుఅఅ) లేదా ఇతర అంతర్గత సమస్యలను గుర్తించడానికి మరికొన్ని పరీక్షలు అవసరమని వైద్య బృందం భావిస్తోంది. మరోవైపు, నిన్న జరిగిన జట్టు ప్రాక్టీస్ సెషన్స్‌కు రోహిత్ శర్మ హాజరుకాలేదు. గాయం తీవ్రత పెరగకుండా జాగ్రత్తగా ఉండాలనే ఉద్దేశంతోనే ఆయన ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. రేపు వాంఖడే స్టేడియంలో పంజాబ్ కింగ్స్ తో జరగబోయే మ్యాచ్‌లో రోహిత్ ఆడటంపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. రోహిత్ ప్రాముఖ్యత దృష్ట్యా, పంజాబ్ మ్యాచ్‌లో ఆయనను ఆడించి రిస్క్ తీసుకోవడం కంటే, విశ్రాంతినివ్వడమే ఉత్తమమని మేనేజ్మెంట్ భావిస్తోంది. అయితే, తాజా సమాచారం ప్రకారం, ఈ మ్యాచ్‌లో ఆడాలా? వద్దా? అనే దానిపై తుది నిర్ణయాన్ని మేనేజ్మెంట్ రోహిత్ శర్మకే వదిలేసింది. పూర్తి రిపోర్టులు వచ్చిన తర్వాత రోహిత్ తన శారీరక ఫిట్‌నెస్‌ను బట్టి నిర్ణయం తీసుకోవచ్చని సమాచారం. ఈ ఐపీఎల్ సీజన్‌లో రోహిత్ శర్మ ఇప్పటివరకు 4 మ్యాచ్‌ల్లో 137 పరుగులు చేశాడు. కేకేఆర్‌పై 78 పరుగులతో అద్భుత ఫామ్‌లో ఉన్న రోహిత్, కీలకమైన సమయంలో గాయపడటం ముంబై జట్టుకు కొంత ఆందోళన కలిగించే విషయమే. బీసీసీఐ మెడికల్ టీమ్ కూడా టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని ఆయన ఫిట్‌నెస్‌ను నిశితంగా గమనిస్తోంది.

# రుతురాజ్ ఉరుకులాట తగ్గించాలి

### రవీచంద్రన్ అశ్విన్ కీలక సలహా

ఐపీఎల్ 2026 సీజన్‌లో పేలవ బ్యాటింగ్‌తో సతమతమవుతున్న చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు రవీచంద్రన్ అశ్విన్ కీలక సలహా ఇచ్చాడు. బ్యాటింగ్‌లో దూకుడు తగ్గించి, క్రీజులో సెట్ అయ్యేందుకు టైమ్ తీసుకోవాలన్నాడు. బంతిని గాల్లోకి లేపకుండా.. సంజూ శాంసన్, ఆయుష్ మాత్రే తరహాలో గ్రౌండెడ్ షాట్స్ ఆడాలని సూచించాడు. మరోవైపు వరుస పరాజయాలతో సతమతమవుతున్న కేకేఆర్ పుంజుకోవాలంటే ఎక్స్ ఫ్యాక్టర్ ఆటగాడు కావాలని అభిప్రాయపడ్డాడు. మంగళవారం చెన్నై వేదికగా జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే 32 పరుగుల భారీ తేడాతో కేకేఆర్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ గురించి జియో హాట్‌స్టార్‌లో మాట్లాడిన అశ్విన్.. సీఎస్‌కే వరుస విజయాలు సాధిస్తున్నా.. రుతురాజ్ గైక్వాడ్ బ్యాటర్‌గా సత్తా చాటాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు.'వరుసగా రెండు విజయాలు కెప్టెన్‌గా రుతురాజ్‌కు పెద్ద ఊరటనిస్తుంది. కానీ అతను బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. అతను తిరిగి ఫామ్ అందుకోవాలంటే బ్యాటింగ్‌లో సాంకేతిక లోపాలను సరిచేసుకోవాలి. టీ20 అంటేనే దూకుడుగా ఆడటం అయినప్పటికీ.. రుతురాజ్ బౌలర్ లైన్ దాటి మరీ ముందుకు వచ్చి త్వరగా వికెట్ పారేసుకుంటున్నాడు. ఆయ-ుష్ మాత్రే, సంజూ శాంసన్ తరహాలో గ్రౌండెడ్ షాట్స్ ఆడాలి. ఇన్నింగ్స్ ప్రారంభంలో కాస్త నిదానంగా వ్యవహరించి, బంతిని సరిగ్గా టైమింగ్ చేస్తూ ఎక్కువ సేపు క్రీజులో ఉంటే రుతురాజ్ తన ఫామ్‌ను తిరిగి పొందుతాడు. రుతురాజ్ గైక్వాడ్ స్థానంలో నేనున్నా ఆందోళన చెందను. కెప్టెన్‌గా సాధించిన విజయాలు అతనిపై ఒత్తిడిని తగ్గిస్తాయి.'అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. మరోవైపు వరుస పరాజయాలతో ఇబ్బంది పడుతున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ పుంజుకోవాలంటే ఎక్స్ ఫ్యాక్టర్ ఆటగాడు రావాలని అశ్విన్ తెలిపాడు. గతంలోనూ కేకేఆర్ ఇలాంటి పరిస్థితుల నుంచి పుంజుకొని విజేతగా నిలిచిందని గుర్తు చేశాడు. 'ప్రస్తుతం కేకేఆర్ జట్టుకు కొత్త శక్తి అవసరం. కేవలం పతిరానా వంటి స్టార్లపైనే ఆధారపడకుండా, డగౌట్‌లో ఉన్న కొత్త ప్రతిభను వెలికితీయాలి. కేకేఆర్ వద్ద తేజస్వి దహియా, ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ సౌరభ్ దూబే వంటి ప్రతిభావంతులు ఉన్నారు. వారికి అవకాశం ఇస్తే జట్టు రూపురేఖలు మారుతాయి. ఐపీఎల్ 2021లో వెంకటేష్ అయ్యర్ జట్టులోకి వచ్చి ఎలాగైతే ఊపు తెచ్చాడో.. ఇప్పుడు కూడా అలాంటి ఒక 'ఎక్స్-ఫ్యాక్టర్' ఆటగాడు కేకేఆర్‌కు అవసరం.'అని అశ్విన్ స్పష్టం చేశాడు.



# కెప్టెన్ అజింక్యా రహానేకు డబుల్ ట్రబుల్..

### ఓటమికి తోడు రూ.12 లక్షల జరిమానా!

ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస ఓటములతో సతమతమవుతున్న కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కెప్టెన్ అజింక్యా రహానేకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి ఐపీఎల్ నిర్వాహకులు రూ.12 లక్షల భారీ జరిమానా విధించారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్‌లలో ఒకటి వర్షం కారణంగా రద్దు కాగా, నాలుగింట కేకేఆర్ ఓటమి పాలవడం గమనార్హం. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో రహానే సేన నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయడంలో విఫలమైంది. ఇది ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేనని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ పేర్కొంది. ఈ సీజన్‌లో కేకేఆర్ జట్టుకు ఇది మొదటి తప్పిదం కావడంతో కెప్టెన్ రహానేకు రూ.12 లక్షల జరిమానాతో సరిపెట్టినట్లు ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. ఇక మ్యాచ్ విషయానికొస్తే, చెన్నై బౌలర్లు నూర్ అహ్మద్ మూడు వికెట్లతో, అన్షుల్ కంబోజ్ రెండు వికెట్లతో చెలరేగడంతో కోల్‌కతా మరో ఓటమిని మూటగట్టుకుంది. ఈ విజయంతో చెన్నై జట్టు ఈ సీజన్‌లో రెండో గెలుపును నమోదు చేసుకుని, 4 పాయింట్లతో పట్టికలో ఎనిమిదో స్థానానికి చేరింది. మరోవైపు ఒక్క విజయం కూడా లేకుండా రహానే నాయకత్వంలోని కోల్‌కతా జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది.

# రైతులకు నాణ్యమైన విత్తనాలే అందించాలి

**సీడ్స్ కార్పొరేషన్ విత్తనాలనే వినియోగించాలి**

**ప్రకటనలకు మోసపోవద్దు: చైర్మన్ అన్వేష్ రెడ్డి**

**గ్రామాల్లో ప్రభుత్వ విత్తనాల విక్రయానికి ప్రత్యేక ప్రణాళిక**

**స్వశక్తి సంఘాలు--వ్యవసాయ అధికారుల సమన్వయం: కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్, ఏప్రిల్ 16: రాబోయే వానాకాలం సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి తెలిపారు. విత్తనాల నాణ్యతను ప్రామాణికంగా తీసుకుని రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో విత్తన డీలర్లు, సహకార సంఘాల సీఈఓలు, ఎఫ్‌పీఓలు, ఏఆర్‌ఎస్‌కే ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సహా పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో విత్తన సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. సీడ్స్ కార్పొరేషన్ కరీంనగర్ యూనిట్ (రంగపేట) నుంచి నాణ్యమైన విత్తనాలను ఉమ్మడి జిల్లా రైతులకు అందిస్తున్నామని చెప్పారు.

### పరీక్షల తర్వాతే పంపిణీ

రైతుల వద్దే ఉత్పత్తి చేసిన విత్తనాలను సేకరించి, ఆధునాతన ప్రయోగశాలల్లో పరీక్షించి నాణ్యత నిర్ధారించిన తరువాతే తిరిగి రైతులకు అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ కంపెనీలకు ఏమాత్రం తగ్గకుండా ప్రభుత్వ విత్తనాల నాణ్యత ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుత వానాకాలానికి అవసరమైన వరి విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయని పేర్కొంటూ, బీపీటీ 5204, ఆర్‌ఎన్‌ఆర్ 15048, కెఎన్‌ఎం 1638, జేజిఎల్ 27356 వంటి సన్నరకాలు, అలాగే కెఎన్‌ఎం 118, ఎమ్‌టియు 1010 వంటి దొడ్డు రకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదనంగా భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట విత్తనాలు కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. డీలర్లు తప్పనిసరిగా ప్రభుత్వ విత్తనాలను విక్రయించాలని, కేవలం రాయితీ విత్తనాలకే పరిమితం కాకుండా అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 2.8 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని, దీనికి సుమారు 60 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేశారని తెలిపారు. అందులో కనీసం 25 వేల క్వింటాళ్ల విత్తనాలను సంస్థ ద్వారా సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

### గ్రామస్థాయిలో విక్రయానికి ప్రణాళిక

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ గ్రామ గ్రామానా ప్రభుత్వ విత్తనాల విక్రయాన్ని పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. స్వశక్తి మహిళా సంఘాలు, వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో రైతులకు విత్తనాలు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ విత్తనాలపై విస్తృత అవగాహన కల్పిస్తూ, రైతులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తగా ఉండాలని, మోసపూరిత ప్రకటనలకు మోసపోవద్దని సూచించారు.

ఈ సమావేశంలో ఆర్డీవో కే. మహేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, డీఆర్‌డీఓ శ్రీధర్, సహకార అధికారి, సీడ్ కార్పొరేషన్ మేనేజర్ రాజీవ్ కుమార్, ప్రాంతీయ మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి, మహిళా సంఘాల ప్రతినిధులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



# రామ్ చరణ్ 'పెద్ది' జూన్‌కు వాయిదా

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదల మరోసారి వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఏప్రిల్ 30న విడుదల కావాల్సిన ఈ సినిమాను జూన్ నెలలో రిలీజ్ చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ బుధవారం అధికారికంగా ప్రకటించింది. సినిమాకు సంబంధించిన టాకీ పార్ట్ మొత్తం పూర్తయిందని, కేవలం ఒక పాట చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉందని చిత్రబృందం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే సినిమా ఎడిట్ ప్రింట్ చూసుకున్నామని, అవుట్‌పుట్ పట్ల చాలా సంతోషంగా ఉన్నామని పేర్కొంది. "ప్రేక్షకులకు అత్యుత్తమ థియేటర్ అనుభవాన్ని అందించాలనేదే మా లక్ష్యం. అద్భుతమైన కంటెంట్‌ను అంతే గొప్పగా ముస్తాబు చేసేందుకు, పోస్ట్ ప్రొడక్షన్, టెక్నికల్ టీమ్స్‌కు మరికొంత సమయం ఇవ్వాలనుకుంటున్నాం. వారి నైపుణ్యంతో సినిమాను పరిపూర్ణంగా తీర్చిదిద్దేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని నిర్మాతలు వివరించారు. సినిమా పాటలు, గ్లింప్స్‌కు వస్తున్న అద్భుతమైన స్పందనకు ధన్యవాదాలు తెలిపిన చిత్రబృందం, అభిమానుల సహకారానికి కృతజ్ఞతలు చెప్పింది. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. జూన్‌లో కచ్చితమైన విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని మేకర్స్ స్పష్టం చేశారు.





# వారణాసి కోసం దేవర సెట్స్?

సూపర్‌స్టార్ మహేష్ బాబు మరియు దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న 'వారణాసి' సినిమాపై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం వారణాసి టీమ్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ 'దేవర' సినిమా కోసం వాడిన టెక్నికల్ బ్యాక్‌డ్రాప్‌ను ప్రత్యేకంగా అండర్ వాటర్/వాటర్ సెట్స్ వినియోగించబోతున్నట్లు తెలుస్తుంది. 'దేవర' సినిమాలోని సముద్రపు సన్నివేశాల కోసం హైదరాబాద్‌లోని శంషాబాద్ వద్ద భారీ వాటర్ ట్యాంక్ సెట్‌ను, బ్లూ మ్యాట్ టెక్నాలజీతో రూపొందించారు. ఇప్పుడు అదే సెట్‌ను 'వారణాసి'లో గంగా నది నేపథ్యంలో వచ్చే కీలక సన్నివేశాల కోసం రీ-డిజైన్ చేసి వాడుతున్నట్లు తెలుస్తోంది. నిజానికి ఈ షెడ్యూల్ విదేశాల్లో జరగాల్సి ఉంది. కానీ ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ ప్రయాణాలు రిస్క్ అని భావించిన రాజమౌళి, తెలివిగా ప్లాన్ మార్చి హైదరాబాద్‌లోనే షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఈ సెట్‌లో మహేష్ బాబుపై భారీ రివర్ ఛేజ్ మరియు కొన్ని హై-టెక్ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. 'దేవర'లో వాడిన అడ్వాన్స్‌డ్ సినిమాటోగ్రఫీ టెక్నిక్స్ మరియు వాటర్ షూట్ ఎక్స్‌పర్టీస్‌ను ఈ షెడ్యూల్ కోసం ఉపయోగిస్తున్నట్లు సమాచారం.



# విష్ణుప్రియకు కాసులు కురిపించిన వివాదం

డిజిటల్ మీడియా యుగంలో నెగెటివ్ పబ్లిసిటీ కూడా ఒక్కోసారి పాజిటివ్ ఫలితాలను ఇస్తుందనడానికి తాజా ఉదాహరణగా నిలుస్తున్నారు బుల్లితెర నటి, బిగ్‌బాస్ ఫేమ్ విష్ణుప్రియ భీమినేని. అశ్లీల కంటెంట్‌ను ప్రోత్సహిస్తున్నారంటూ ఆమెపై నమోదైన పోలీస్ కేసు, నైతికంగా ఆమెను ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతో చేసినప్పటికీ, ఆర్థికంగా మాత్రం ఊహించని రీతిలో కలిసొచ్చింది. ఈ వివాదం కారణంగా ఆమె నెలవారీ ఆదాయం ఏకంగా రూ.11 లక్షలకు పైగా పెరగడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

విష్ణుప్రియ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రత్యేకమైన వీడియోల కోసం నెలకు రూ.399 చొప్పున సబ్‌స్క్రిప్షన్ ఫీజు వసూలు చేస్తున్నారు. ఆమెపై విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు అందకముందు, ఆమెకు 1,892 మంది సబ్‌స్క్రైబర్లు ఉండేవారు. దీని ద్వారా ఆమెకు నెలకు సుమారు రూ.7.18 లక్షల ఆదాయం వచ్చేది. అయితే, ఎప్పుడైతే ఆమెపై ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) నేతలు ఫిర్యాదు చేశారో, ఈ వార్త మీడియాలో ప్రముఖంగా ప్రసారమైంది. దీంతో ఆమె అప్‌లోడ్ చేసే కంటెంట్‌లో ఏముందో చూడాలనే ఆసక్తి నెటిజన్లలో ఒక్కసారిగా పెరిగింది. ఫలితంగా, కొద్ది రోజుల్లోనే ఆమె సబ్‌స్క్రైబర్ల సంఖ్య 4,832కు చేరింది. తద్వారా ఆమె నెలవారీ ఆదాయం ఇప్పుడు రూ.18.36 లక్షలకు పైగా చేరింది. అంటే, కేవలం ఈ వివాదం వల్ల ఆమె సంపాదనలో రూ.11 లక్షలకు పైగా పెరుగుదల కనిపించింది.



# కియారా ఆ రిస్క్ చేస్తుందా?

పాన్ ఇండియా లెవల్‌లో భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న టాక్సిక్ సినిమా ఇప్పుడు కేవలం కంటెంట్ వల్లే కాదు, కాంట్రవర్సీ వల్ల కూడా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా కియారా అద్వానీ చుట్టూ తిరుగుతున్న ఓ బోల్డ్ సీన్ వివాదం ఇండస్ట్రీలో పెద్ద డిబేట్‌కు దారి తీసింది. ఇప్పటివరకు గ్లామర్ పాత్రల్లో కనిపించినా, ఎప్పుడూ ఒక లిమిట్‌లోనే ఉన్న కియారా, ఈసారి కథ డిమాండ్ మేరకు ఓ సాహసోపేత సన్నివేశంలో నటించిందనే టాక్ వినిపిస్తోంది. అయితే ఫైనల్ అవుట్‌పుట్ చూసిన తర్వాత, ఆ సీన్ తన పబ్లిక్ ఇమేజ్‌పై ప్రభావం చూపుతుందేమోనని ఆమె ఆందోళన చెందుతూ, దాన్ని తొలగించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. పెళ్లి తర్వాత హీరోయిన్‌గా తీసుకునే నిర్ణయాల్లో మార్పు వస్తుందా అనే ప్రశ్న కూడా ఈ సందర్భంలో ముందుకు వచ్చింది. పెళ్లి తర్వాత పబ్లిక్ పర్సెప్షన్‌పై ఎక్కువ శ్రద్ధ పెట్టడం సహజమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే టైమ్ లో డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తన కథకు ఆ సీన్ కీలకమని భావిస్తే, హీరోయిన్ కంఫర్ట్ కూడా అంతే ముఖ్యమని మరో వర్గం చెబుతోంది. దీంతో క్రియేటివ్ ఫ్రీడమ్, నటీనటుల వ్యక్తిగత ఇమేజ్ మధ్య ఉన్న సున్నితమైన సమతౌల్యం మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. ఇంకా యష్ లాంటి పాన్ ఇండియా స్టార్ ఈ ప్రాజెక్ట్‌లో ఉండటం వల్ల ఈ వివాదం ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉంది. దీనిపై ఫ్యాన్స్ ఎలా రియాక్ట్ అవుతారు? సినిమా మీద అంచనాలు పెరుగుతాయా? లేక ఈ కాంట్రవర్సీ నెగటివ్‌గా మారుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు, హీరోయిన్స్‌పై ఇప్పటికీ ఇమేజ్ ప్రెజర్ ఉందా? బోల్డ్ సీన్స్ విషయంలో డబుల్ స్టాండర్డ్స్ ఉన్నాయా? అనే ఫెమినిస్టు చర్చలు కూడా తెరపైకి వస్తున్నాయి. మొత్తానికి, ఈ ఒక సీన్ చుట్టూ తిరుగుతున్న చర్చ ఇప్పుడు కేవలం ఓ సినిమా విషయాన్ని దాటి, ఇండస్ట్రీలోని పెద్ద ప్రశ్నలను లేవనెత్తుతోంది. చివరికి డైరెక్టర్, హీరోయిన్ కలిసి ఏ నిర్ణయం తీసుకుంటారు? బజ్ కోసం రిస్క్ తీసుకుంటారా? లేక సేఫ్ గేమ్ ఆడతారా? అన్నది చూడాలి.

# చెత్తను వేరు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత

### మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి



హుస్నాబాద్,జనత న్యూస్: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలోని 17వ వార్డులో పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చెత్త విభజన, హోమ్ కంపోస్టింగ్, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పురపాలక సంఘ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి నుంచి వెలువడే చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. డ్రైనేజీల్లో చెత్త వేయరాదని, చెత్తను వేరు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సెప్టిక్ ట్యాంకులను మూడు సంవత్సరాలకు ఒకసారి శుభ్రం చేయించుకోవాలని సూచించారు. అవసరం లేని కానీ ఉపయోగపడే వస్తువులను ఆర్ఆర్ఆర్ కేంద్రాలకు అందించాలని కోరారు. వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ మాట్లాడుతూ ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని, అవి ఆరోగ్యానికి హానికరమని చెప్పారు. వాటి బదులుగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకులను వినియోగించాలని సూచించారు. వార్డు కౌన్సిలర్ గాదెపాక రవీందర్ మాట్లాడుతూ చెత్తను వేరు చేయకపోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. తడి చెత్తతో తయారు చేసే ఎరువును మొక్కలకు వినియోగించాలని, ప్రతి మహిళ కనీసం మరో పదిమందికి చెత్త విభజనపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, బసిల్ ఫౌండేషన్ సూపర్వైజర్ నవీన్, వార్డ్ ఇన్‌చార్జ్ అధికారులు సతీష్, శ్రీకాంత్, వార్డ్ ఆర్‌పి రజిత తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## హుస్నాబాద్ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎంపికకు నోటిఫికేషన్

**నలుగురు సభ్యుల నియామకం... రెండు విభాగాల్లో మహిళలకు ప్రాధాన్యం**

**ఈ నెల 21లోపు దరఖాస్తులు సమర్పించాలని సూచన**

**మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్**



హుస్నాబాద్,జనత న్యూస్: హుస్నాబాద్ పురపాలక సంఘంలో కో ఆప్షన్ సభ్యుల నియామకానికి మున్సిపల్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ప్రకారం మొత్తం నలుగురు సభ్యులను ఎంపిక చేయనున్నారు. ఇందులో మున్సిపల్ పరిపాలనపై అనుభవం, అవగాహన కలిగిన ఇద్దరు, అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన ఇద్దరిని నియమించనున్నారు. రెండు విభాగాల్లోనూ ఒక్కో మహిళకు అవకాశం కల్పించనున్నారు. అభ్యర్థులు మున్సిపల్ ఓటరు జాబితాలో పేరుతో పాటు కనీసం 21 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. పరిపాలన అనుభవం కేటగిరీలో దరఖాస్తు చేసేవారు గతంలో చైర్మన్, వైస్ చైర్మన్ లేదా కౌన్సిలర్‌గా ఐదేళ్ల అనుభవం కలిగి ఉండాలి. అలాగే సర్పంచ్ లేదా వార్డు సభ్యులుగా ఐదేళ్లు పనిచేసిన వారూ అర్హులే. మున్సిపల్ కౌన్సిల్‌లో కనీసం మూడేళ్లు న్యాయవాదిగా పనిచేసిన వారు లేదా మున్సిపల్ శాఖలో గెజిటెడ్ హోదాలో సేవలందించి పదవీ విరమణ పొందినవారికి కూడా అవకాశం ఉంది. అల్పసంఖ్యాక వర్గాల్లో ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, పార్సీ మతాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ తెలిపారు.

## పొన్నాల అశోక్‌కు ‘అంబేద్కర్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్’ పురస్కారం




హుస్నాబాద్,జనత న్యూస్: తెలంగాణ ఉద్యమ కళాకారుడు, ప్రముఖ సామాజిక కార్యకర్త పొన్నాల అశోక్‌ను ప్రతిష్టాత్మక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు 2026 వరించింది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని గుంతకల్లుకు చెందిన విక్టరీ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమంలో కళాకారుడిగా తన వంతు విశిష్ట సేవలు అందించడమే కాకుండా, మంజులక్క యువసేన సభ్యుడిగా నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ సమాజ మార్పు కోసం కృషి చేస్తున్న అశోక్‌ను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విక్టరీ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ చేతుల మీదుగా అశోక్ ఈ అవార్డును అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2009 నుండి కళా రంగంలో, సామాజిక సేవా పథంలో తాను సాగిస్తున్న ప్రయాణాన్ని గుర్తించి, ఈ గౌరవాన్ని అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మహనీయుల ఆశయ సాధన కోసం పనిచేస్తున్న తనకు ఈ పురస్కారం మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ తన వంతు సామాజిక సేవను కొనసాగిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొని అశోక్‌ను ఘనంగా సత్కరించారు.

## రైతులకు ‘మద్దతు’ భరోసా.. ధాన్యం కొనుగోలు షురూ!

**క్వింటాకు రూ. 2,389 మద్దతు ధర. సన్నాలకు రూ. 500 బోనస్**

**దళారుల బారిన పడకండి మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి**



హుస్నాబాద్,జనత న్యూస్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను ముమ్మరం చేసిందని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి తెలిపారు. బుధవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో సింగిల్ విండో, మార్కెట్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆత్మ కమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన పంటను దళారులకు అమ్మి నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం ‘ఏ’ గ్రేడ్ రకానికి క్వింటాకు రూ. 2,389, సాధారణ రకానికి రూ. 2,369 చెల్లిస్తామని వివరించారు. ముఖ్యంగా సన్న వడ్లు పండించిన రైతులకు క్వింటాకు రూ. 500 అదనపు బోనస్ అందించడం వల్ల అన్నదాతలకు భారీ లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం నుంచి చెల్లింపుల వరకు అంతా పారదర్శకంగా జరుగుతుందని, రైతులు నిర్భయంగా ధాన్యాన్ని తీసుకురావాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, డైరెక్టర్లు మడప యాదవ రెడ్డి, బాలయ్య, బొంగోని శ్రీనివాస్, కరెంటోతు రవి, మున్సిపల్ కౌన్సిలర్ కేశవేణి రమేష్, కాంగ్రెస్ నాయకులు ఎండి హసన్, వెన్న రాజు, విద్యాసాగర్, సతీష్, బొమ్మగాని రాజు, వ్యవసాయ అధికారి పూజ, మార్కెట్ సూపర్వైజర్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## నారీశక్తితో నవభారత నిర్మాణం: మోదీ ప్రభుత్వం

**మహిళలకు 33% రిజర్వేషన్ చారిత్రక నిర్ణయం: చొప్పరి జయశ్రీ**



కరీంనగర్, ఏప్రిల్ 16: నారీశక్తివందన్ అధినియం ద్వారా మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలుకుతూ మోదీ ప్రభుత్వం నవభారత నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ తెలిపారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో నారీశక్తి వందన్ అధినియం బిల్లును ప్రవేశపెట్టనున్న సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్‌లో స్కూటీ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఆర్ఆర్ కళాశాల నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా మార్క్‌ఫెడ్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చొప్పరి జయశ్రీ మాట్లాడుతూ మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల నిజమవుతున్న సమయం ఆసన్నమైందన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ మహిళల రాజకీయ ప్రాతినిధ్యంపై సమగ్రంగా ఆలోచించలేదని, మోదీ ప్రభుత్వం మాత్రం మహిళల అభివృద్ధి, సాధికారత కోసం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. నారీశక్తి వందన్ అధినియం బిల్లు మహిళలకు రాజకీయంగా పెద్ద మైలురాయిగా నిలుస్తుందని, దేశ ప్రధాని మహిళలకు ఇచ్చే గొప్ప కానుకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ దేశ శిల్ప, నిర్మల రెడ్డి, కొలగాని స్వర్ణ, వరాల జ్యోతి, సాధవేని లావణ్య, కర్రె పద్మ, శ్వేత, ప్రభావతి, గాజి రమ, పొన్నం లక్ష్మి, నాంపల్లి రేణుక, పెద్దపల్లి శ్రీలేఖ, ఎన్నం లక్ష్మి, సరస్వతి, సుమ రమణారెడ్డి, సాయిని మల్లేశం, గుజ్జ శ్రీనివాసరావు, శశిధర్, బీజేవైఎం సంపత్, గుగ్గిళ్ళ రమేష్, సత్యనారాయణ రెడ్డి, సోమిరెడ్డి వేణు, సునీత, స్వప్న, లావణ్య రెడ్డి, చైతన్య, నరేడ్ల ప్రవీణ్ చంద్ర, బండారి వేణు, చంద్రికతో పాటు వివిధ డివిజన్ల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హుస్నాబాద్ జర్నలిస్ట్‌కు ‘దళిత రత్న’ అవార్డు

**అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఘన సత్కారం**



హుస్నాబాద్,జనత న్యూస్:హుస్నాబాద్‌కు చెందిన పాత్రికేయుడు ఆరె శరత్‌కు ప్రతిష్టాత్మక “ఉత్తమ జర్నలిస్ట్ దళిత రత్న” అవార్డు లభించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. గత దశాబ్దంగా జర్నలిజం రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన శరత్, సామాజిక న్యాయం, దళితుల హక్కులు, గ్రామీణ సమస్యలు, సామాన్య ప్రజల కష్టాలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజా స్వరంగా నిలుస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశారు. అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ అల్లిబిల్లి మహేందర్ చేతుల మీదుగా శరత్ అవార్డు స్వీకరించారు. కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఆరె కిశోర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అవార్డు అనంతరం హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సమాజానికి ఉపయోగపడే విధంగా జర్నలిజం కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తనకు అవార్డు ప్రదానం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, సహకరించిన జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, ప్రధాన కార్యదర్శి వెన్న రాజులకు శరత్ కృతజ్ఞతలు తెలిపారు.

## అత్యుత్తమ మార్కులతో జాతీయ స్థాయిలో మెరిసిన అల్ఫోర్స్ సీబీఎస్ఈ విద్యార్థులు

**సంచలన ఫలితాలతో మరోసారి ప్రతిభ చాటిన విద్యార్థులు**




కరీంనగర్, ఏప్రిల్ 15: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో అల్ఫోర్స్ హై స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో విద్యార్థుల సన్మాన కార్యక్రమం, పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, పటిష్టమైన ప్రణాళికలతో బోధన అందిస్తే విద్యార్థులు సంచలనాత్మక ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో నాణ్యమైన బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల కృషితో విద్యార్థులు జాతీయ స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు.

ఈ ఏడాది సీబీఎస్ఈ ఫలితాల్లో మొత్తం 103 మంది విద్యార్థులు 500 మార్కులకు గాను 450కి పైగా మార్కులు సాధించడం విశేషమని తెలిపారు. జిల్లా స్థాయిలో ఇది ఒక కొత్త రికార్డు అని పేర్కొన్నారు. విద్యార్థులలో సానీక 494 మార్కులు, ఆదిత్య 492 మార్కులు సాధించగా, ఎం. శ్రీహిత, ఏ. హర్ష, ఏ. శ్రీనిత 490 మార్కులు, కే. ఓం కార్తికేయ, కె. అస్మిత, కే. అభిజ్ఞ 488 మార్కులు, ఏ. స్వరవిస్తృతి 487 మార్కులు, ఎం. శ్రీగౌరీ 486 మార్కులు, కె. వర్ధిని 485 మార్కులు సాధించారు. అదేవిధంగా ఉదయశ్రీ, వి. అభిరామ్ 484 మార్కులు, కే. మోక్ష, జి. సాయి సుశేన్, ఈ. ప్రమేష్ రెడ్డి 483 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. అలాగే పలువురు విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో శాతం మార్కులు సాధించడం గర్వకారణమని తెలిపారు. ఈ విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, అహర్నిశలు శ్రమించిన ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో సత్కరించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ అభినందన



సిరిసిల్ల, ఏప్రిల్ –15 జనతా న్యూస్. ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ)విద్యార్థులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం అభినందించారు. ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలు విడుదల కాగా, జిల్లాలోని ప్రథమ సంవత్సరంలో సిరిసిల్ల కేజీబీవీ బీపీసీలో కీర్తన 436/440, మర్రిపల్లి కేజీబీవీ ఎంపీసీలో బీ మమత 466/470, రుద్రంగి కేజీబీవీ ఎంపీసీలో జీ మమత 466/470 మార్కులు సాధించారు. తంగళ్లపల్లి కేజీబీవీ ఎంపీ హెచ్ డబ్ల్యూలో ఎల్ శృతికి490 /500, వేములవాడ కేజీబీవీ ఏఐఎంఎల్ లో అక్షిత 486/500, మర్రిపల్లి కేజీబీవీలో జీ శ్యామల ఎంపీసీలో 984/1000 మార్కులు సాధించిన సందర్భంగా ఆ విద్యార్థులు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను కలువగా, వారిని అభినందించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్ణయించుకొని పట్టుదలతో కృషి చేస్తే విజయాన్ని సాధించడం సాధ్యమవుతుందని ఆమె సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జీసీడీఓ పద్మజ, స్పెషల్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

# అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా పని చేయాలి

## రెవెన్యూ అధికారులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ హెచ్చరిక



కరీంనగర్, ఏప్రిల్ 16: రెవెన్యూ అధికారులు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ప్రజలకు జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ విభాగ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, 5% రిబేట్ పథకం కింద పన్నుల వసూళ్లు, మ్యూటేషన్లు, రివిజన్ పిటిషన్లు, అసెస్మెంట్, సెల్ఫ్ అసెస్మెంట్ అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదులు, డబుల్ ఇంటి నెంబర్ల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, రెవెన్యూ విభాగంలో పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యూటేషన్లు (ఆస్తి బదలాయింపులు), రివిజన్ పిటిషన్లు, అసెస్మెంట్, సెల్ఫ్ అసెస్మెంట్ దరఖాస్తులను ఫీల్డ్ స్థాయిలో పరిశీలించి ఆలస్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. ఐజీఆర్ఎస్ కింద వచ్చే ఫైల్స్‌కు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని, డబుల్ ఇంటి నెంబర్ల సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ ఆదాయం పెరగడానికి రెవెన్యూ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని పేర్కొన్నారు. కమర్షియల్ స్థలాలను రెసిడెన్షియల్ కేటగిరిలో చూపిస్తూ తక్కువ పన్నులు వసూలు అవుతున్న కేసులను గుర్తించి సరిదిద్దాలని సూచించారు. టాక్స్ అసమానతలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ విభాగం పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన మేయర్, అధికారులపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని హెచ్చరించారు. ఎవరైనా తమ పేరు చెప్పుకుని లీగల్ విషయాల్లో ఒత్తిడి తీసుకొస్తే స్పందించవద్దని, కేవలం న్యాయబద్ధంగా ఉన్న దరఖాస్తులకే పరిష్కారం ఇవ్వాలని స్పష్టం చేశారు. 5% రిబేట్ పథకం కింద పన్నుల వసూళ్లను లక్ష్యంగా పెట్టుకుని 15 రోజుల్లో టార్గెట్ పూర్తి చేయాలని సూచించారు. ఈ రాయితీపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శక సేవలు అందించాలని ఆదేశించారు. "ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా మెరుగైన సేవలు అందించాలి" అని మేయర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు ఖాధర్ మొహియుద్దీన్, వేణు మాధవ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సెక్షన్ క్లర్కులు పాల్గొన్నారు.

# పాలనలో లక్ష్మీ కిరణ్ తనదైన ముద్ర

**అత్యుత్తమ సేవలకు కేరాఫ్ అడ్రస్: కలెక్టర్ చిత్రా మిశ్రా**

**అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్‌కు ఘన వీడ్కోలు**



కరీంనగర్, ఏప్రిల్ 16: కరీంనగర్ జిల్లా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి పాలనలో తనదైన ముద్ర వేసుకున్న అధికారిగా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్ గుర్తింపు పొందారని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తూ డైనమిక్ అధికారిగా పేరు సంపాదించుకున్నారని ఆమెను అభినందించారు. లక్ష్మీ కిరణ్ సిద్దిపేట జిల్లాకు బదిలీ కావడంతో బుధవారం రాత్రి కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దాదాపు మూడు సంవత్సరాల పాటు కరీంనగర్ జిల్లాలో లక్ష్మీ కిరణ్ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించారని తెలిపారు. రెవెన్యూ రంగంలో అనేక క్లిష్ట సమస్యలను పరిష్కరించి ప్రజలకు చేరువయ్యారని, కిందిస్థాయి ఉద్యోగుల నుంచి ఉన్నతాధికారుల వరకు అందరి మెప్పు పొందారని అన్నారు. ప్రత్యేకంగా రైతులు పండించిన వరి కొనుగోలు ప్రక్రియలో జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపారని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేశారని పేర్కొన్నారు. విధుల పట్ల నిబద్ధత, అకుంఠిత దీక్షతో ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేసిన అధికారిగా లక్ష్మీ కిరణ్ నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా లక్ష్మీ కిరణ్ మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లా తనకు ప్రత్యేక గుర్తింపునిచ్చిందని తెలిపారు. ఈ జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేయడం జీవితంలో మర్చిపోలేని అనుభవమని పేర్కొన్నారు. ఉద్యోగులు, అధికారులు అందరూ ప్రజా సమస్యల పరిష్కారంలో చక్కటి సహకారం అందించారని చెప్పారు. గత కలెక్టర్ పమేలా సత్పతి, ప్రస్తుత కలెక్టర్ చిత్రా మిశ్రా మార్గదర్శకత్వంలో పనిచేయడం సంతృప్తిని కలిగించిందని తెలిపారు. కరీంనగర్ జిల్లాను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటానని పేర్కొన్న ఆమెను జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, టీఎన్జీవో నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవోలు కే. మహేశ్వర్, రమేష్ బాబు, డిఆర్డిఓ శ్రీధర్, ఏవో సుధాకర్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కాళీచరణ్ తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ రోల్ మోడల్‌గా నిలవాలి

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశాలు పకడ్బందీగా నిర్వహించాలి**

**అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత అవగాహన అవసరం: కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్, ఏప్రిల్ 16: జిల్లాలో నిర్వహించనున్న ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సమావేశాలను అత్యంత పకడ్బందీగా, ప్రజా పాలన ప్రతిబింబించేలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశాలు చారిత్రాత్మకంగా నిలిచేలా సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ నెల 16న మండల స్థాయిలో జరగనున్న సమావేశాల నేపథ్యంలో బుధవారం సాయంత్రం జిల్లా స్థాయి అధికారులతో పాటు ఎంపీడీవోలు, ఎంఈఓలు, ఎంపీవోలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశాల విజయవంతానికి సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సంక్షేమ పథకాల వారీగా లబ్ధిదారుల వివరాలను స్పష్టంగా వెల్లడించాలని పేర్కొన్నారు. రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మహిళలకు రుణాలు, కార్పొరేషన్ల ద్వారా అందించిన సహాయం, మహాలక్ష్మి పథకం, సన్నబియ్యం పంపిణీ వంటి అంశాలపై ప్రత్యేకంగా వివరించాలని ఆదేశించారు. మండలాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, విద్య, వైద్యం, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, రైతు సంక్షేమం వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అందరూ సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేయాలని, ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించాలని సూచించారు. జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలబెట్టే విధంగా సమావేశాలను నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీపీఓ జగదీశ్వర్, ఇన్‌చార్జి సీపీఓ రామ్ దత్తారెడ్డి, డీఎంహెచ్వో వెంకటరమణ, జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, డీఎస్ఓ నర్సింగరావు, డీఆర్డీఓ శ్రీధర్, సంక్షేమ అధికారి సరస్వతి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ తదితర అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# పేదలకు సేవలందించడమే ఆలయ ఫౌండేషన్ లక్ష్యం

**కృత్రిమ కాలు అమర్చి బాధితురాలికి తోడ్పాటు**



కరీంనగర్, ఏప్రిల్ 16 : పేద ప్రజలకు విద్య, వైద్య రంగాల్లో అవసరమైన సేవలు అందించడమే ఆలయ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫౌండేషన్ సభ్యులు తీట్ల రమేష్ బాబు తెలిపారు. ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి మార్గదర్శకత్వంలో ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన నక్క మొండయ్య భార్య లక్ష్మి అనారోగ్య కారణాలతో మోకాలి పైభాగం వరకు శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే. ఆమెకు ఆలయ ఫౌండేషన్ సీఈఓ కీర్తి నాగార్జున సహకారంతో హైదరాబాద్‌లో కృత్రిమ కాలు అమర్చించారు. బుధవారం మొగిలిపాలెం గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా తీట్ల రమేష్ బాబు మాట్లాడుతూ, ఫౌండేషన్ ద్వారా కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు, వైద్య సహాయం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బసంత్ నగర్‌లో పెద్ద ఆసుపత్రిని ఏర్పాటు చేసి పేదలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాల కోసం కార్పొరేట్ సంస్థల సహకారంతో క్యాంపులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కృత్రిమ కాలు అమర్చేందుకు సహకరించిన మాజీ వైస్ ఎంపీపీ తుమ్మనపల్లి శ్రీనివాసరావు, న్యాయవాది మరియు బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాట్ల తిరుపతి, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, వార్డు సభ్యులు చెన్నబోయిన రవి, పాశం రాఘవరెడ్డి, ఎల్కపల్లి స్వామి, జక్కుల శ్రీనివాస్, జనార్ధన్ రావు, రవికుమార్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న చేను దగ్ధం

**నవాబుపేటలో రైతు కుటుంబానికి తీరని నష్టం**



చిగురుమామిడి,జనత న్యూస్: ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చే తరుణంలో అగ్నిప్రమాదం ఆ రైతు కుటుంబాన్ని నిలువునా ముంచేసింది. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మొక్కజొన్న చేను కాలి బూడిదైన ఘటన స్థానికంగా విషాదం నింపింది. గ్రామానికి చెందిన బొల్లి లింగయ్య, లచ్చవ్వ దంపతులు తమకున్న పొలంలో మొక్కజొన్న సాగు చేశారు. కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో, పొలం పైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాసుకుని నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. క్షణాల్లోనే మంటలు చేనంతా వ్యాపించడంతో సుమారు 20 గుంటల విస్తీర్ణంలో ఉన్న పంట పూర్తిగా అగ్నికి ఆహుతైపోయింది. మంటలను గమనించిన గ్రామస్థులు వెంటనే స్థానిక సర్పంచ్ గూళ్ల రజితకు సమాచారం అందించారు. ఆమె బాధ్యతాయుతంగా స్పందించి తక్షణమే అగ్నిమాపక సిబ్బందిని అప్రమత్తం చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో మిగతా పంటకు ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదం వల్ల తమకు సుమారు 30 వేల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని, అప్పులు తెచ్చి సాగు చేసిన పంట బుగ్గిపాలు కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం చెల్లించాలని సర్పంచ్ గూళ్ల రజిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# ఉల్లంపల్లిలో నాణ్యత కరువైన సిసి రోడ్ల నిర్మాణం

**అధికారుల పర్యవేక్షణ శూన్యం.. వార్డు సభ్యుల ఆగ్రహం**



చిగురుమామిడి,జనత న్యూస్ :గ్రామంలో ఇటీవల చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణ పనులు నాణ్యత లోపంతో సాగుతున్నాయని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోందని గ్రామ వార్డు సభ్యులు ఆరోపించారు. బుధవారం గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి పనుల పేరిట నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రోడ్డు పనులు ప్రారంభించే సమయంలో సంబంధిత ఏఈ, డీఈ వంటి సాంకేతిక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించకపోవడం వల్లే కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వారు ధ్వజమెత్తారు. ముఖ్యంగా నిర్మాణంలో ఒకే రకమైన నాణ్యమైన సిమెంట్‌కు బదులుగా, సుమారు నాలుగు రకాల సిమెంట్లను వాడుతూ పనులను మమ అనిపిస్తున్నారని వారు విమర్శించారు. రోడ్డు వేసిన తర్వాత పటిష్టంగా ఉండటానికి అవసరమైన వాటర్ క్యూరింగ్ ప్రక్రియను పూర్తిగా విస్మరించడం వల్ల రోడ్లు త్వరగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులుగా లోపాలను ప్రశ్నిస్తే, సంబంధిత పంచాయతీ కార్యదర్శి కనీస గౌరవం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వారు అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తూ, నాణ్యత లేని పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌పై, పర్యవేక్షణలో విఫలమైన అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు సక్రమంగా వినియోగమయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సయ్యద్ షరీఫ్, యువజన నాయకులు జనవేని విజయ్, నర్సింగ్ విజయ్, రావుల రవీందర్, సయ్యద్ చిన్న ఫకీర్, ఎండీ పటాన్ సలాం, సలీం, సయ్యద్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

# వన్ ఆసుపత్రిపై ఆరోపణలు... విచారణ చేసి చర్యలు తీసుకోవాలి

**అనుమతులు రద్దు చేసి సీజ్ చేయాలని డిమాండ్**

**ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగంధర్**






కరీంనగర్, ఏప్రిల్ 15: నగరంలోని కోర్టు రోడ్డులో గల వన్ ఆసుపత్రి వైద్యుల తీరుపై తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి అవసరమైతే ఆసుపత్రిని సీజ్ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగంధర్ డిమాండ్ చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, వేములవాడ మండలం షాత్రాజుపల్లికి చెందిన సాహెబ్ బీ (60) గుండె సంబంధిత వ్యాధితో ఈ నెల 10న ఆసుపత్రిలో చేరగా, యాంజియోగ్రామ్ అనంతరం శస్త్రచికిత్స నిర్వహించారని తెలిపారు. అనంతరం పరిస్థితి విషమించి ఆమె మరణించిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఇటీవల ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆరోపించారు. గడచిన వారం రోజుల్లో వేములవాడ ప్రాంతానికి చెందిన మరికొంతమంది కూడా చికిత్స కోసం వచ్చి మరణించారని పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్వహణ, వైద్య విధానాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఆసుపత్రి అనుమతులను సమీక్షించి అవసరమైతే రద్దు చేయాలని సూచించారు. ఆసుపత్రి యాజమాన్యం, సంబంధిత వైద్యులపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అధికారులు స్పందించకపోతే ఆసుపత్రి ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com